# 3

# పెళ్లిచేసేశాం

"వెయ్యి అబద్దాలాడి ఓ పెళ్ళి చెయ్యాలి" అన్న సామెత బహుశా ఆ వూళ్ళో వాళ్ళే పుట్టించి వుంటారు. అందుకే కల్యాణికి అంత పబ్లిగ్గా పెళ్ళి స్థిరపరచుకుంటోంటే .... పెళ్ళి చూపులు జరిగి పెళ్ళివారు కార్లో వెళ్ళిపోతోంటే, వొక్కరూ నిజం బయటపెట్టలేదు. వాళ్ళందరివీ గొప్ప గొప్ప విశాల హృదయాలేమో! లేకపోతే ఏం జరుగుతుందో చూద్దామన్న కుతూహలమో!

మొత్తానికి ఊళ్ళో వాళ్ళ దయవల్లనే పెళ్ళి స్థిరపడింది. లగ్నం వేళవరకూ వొచ్చింది. పెళ్ళికొడుకు విడిదిలో స్నేహితుల మధ్య వున్నా, వూహలెక్కి, ఎక్కడెక్కడో షికార్లు చేస్తున్నాడు. పెళ్ళికూతురు కల్యాణం బొట్టూ, నగలూ, పట్టుచీరా అద్దంలో తెగచూసుకుని నవ్వుకుంటోంది.

"కొన్ని పెళ్ళిళ్ళు చెడగొట్టి.... కొన్ని సంసారాలు పాడుచెయ్యటం ... మానవసేవే ?" అంటే చాలామంది "శివా! శివా!" అంటూ చెవులు మూసుకుంటారు. అలాంటి శివభక్తులకి ఒక దీన మానవుల కథ చెప్పాలని వుంది.

కళ్యాణి పెళ్ళి చెడగొట్టడం మంచిదో, చెయ్యటం మంచిదో ఆ శివభక్తులు ఆలోచించాలి. ఎవరికి మంచిదంటారేమో! కళ్యాణికే.

ఇతర్ల మంచికోసం కళ్యాణినికి పెళ్ళిచెయ్యటం ఎంత మంచిదోకూడా వారు ఆలోచించాలి.

నిర్మొహమాటంగా చెప్పెయ్యాలంటే కళ్యాణి పిచ్చి పిల్ల. రెండేళ్ళనించీ పిచ్చి. ఇంట్లోవాళ్ళు తెలుసుకున్నది ఏడాదినించే. వైద్యం చేయిస్తోంది ఆర్నెల్లనించే. అసమానం చేతివేళ్ళు లెక్క పెట్టుకోవడం, చక్కగా వేసుకున్న జడ హఠాత్తుగా విప్పుకోవడం వంటి చేష్టలతో ప్రారంభమైంది జబ్బు. అసలా పిల్ల చాలా ముద్దు మురిపాలతో పెరిగింది. అందరూ అన్నాలు తినేవేళకి తను లేచి బద్ధకంగా కాఫీ వొంచుకు తాగడం, అందరూ కాఫీ తాగేవేళకి తను రెండు మెతుకులు మొక్కుబడిగా కెలకడం, వగైరా గారాబంతో కొత్త పిచ్చికూడా పాతబాపతే అనుకున్నారు. కొన్ని నెలలకి బాగా అనుమానం వొచ్చింది ఇంట్లోవాళ్ళకి. స్కూల్ఫైనల్ పాసై కాలేజీలో చేరడానికి సిద్ధంగా వున్న కళ్యాణికి ఎంతో డబ్బుగలవారి అమ్మాయికి అసలు పిచ్చి ఎందుకొచ్చిందో డాక్టర్లు చెప్పాలి. చెప్పారు ఏవో కారణాలు. పెద్ద వూరుకు తీసుకుపోయి పిచ్చాసుపత్రిలో చేర్చి వైద్యం చేయించమన్నారు. కళ్యాణి తల్లిదండ్రులు చాలా దీనంగా— "రహస్యంగా మా మూలగదిలో వైద్యం చెయ్యకూడదా డాక్టరుగారూ ?"- అని అడిగారు చాలామంది డాక్టర్లని. డాక్టర్లంతా వొక్క బళ్ళోనే చదివారో ఏమో- "అలా వీల్లేదు. మూలగది వైద్యం లాభంలేదు"- అనేశారు నిర్మొహమాటంగా. పౌరుషవంతుడైన కళ్యాణి తండ్రికి చాలా కోపం వొచ్చింది డాక్టర్లమీద. "నా వంశం ఎలాంటిది! నా పరువు ప్రతిష్ఠలన్నీ ఆసుపత్రిపాలు చేస్తానా-" అన్నాడు మండిపడుతూ. పతివ్రత అయిన కళ్యాణి తల్లి— "నీ వంశం అంత గొప్పదయితే నీ కూతురికి పిచ్చి ఎలా వొచ్చింది? జబ్బుకి వైద్యం చేయించుకుంటే పోతుందా నీ పరువు? అసలు ముందు నీ వంశానికీ.... నీ పరువుకీ వైద్యం చెయ్యాలి." అనలేదు,

"అయ్యో! పిల్లకేదో కాస్త మతి భ్రమించిందని ఆసుపత్రుల్లో ఎల్లా పెడతామూ?" అని కంట నీరు పెట్టుకుంది.

"పిచ్చిదానా! నువ్వూరుకో. మన రహస్యం ఆసుపత్రివరకూ పొక్కకుండా మన మూలగదిలో వైద్యం చెయ్యగలిగేవాణ్ణి తీసుకొస్తాను." అని శపథం చేశాడు పిచ్చి (పిల్ల) తండ్రి.

"అల్లా చెయ్యండి. అంతేగాని....ఆసుపత్రిల్లో పెడితే పిల్లకి పెళ్ళవుతుందా? మనం చెయ్యగలమా?" అందావిడ—పిల్లలు పెళ్ళిళ్ళు చేసుకోడానికి తల్లితండ్రులు పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యడానికీ జన్మలెత్తుతారని ఆవిడ గాఢ నమ్మకం.

ఎందులోనూ, ఎప్పుడూ ఏకీభవించని ఆ భార్యాభర్తలు, 'వంశం పరువు' ఆస్పత్రి కెక్కించకూడదనే విషయంలో వాక్కుమ్మడిగా ఏకీభవించి ... కూతురు జబ్బుకు రహస్యంగా వైద్యం చెయ్యగల నిపుణులకోసం రహస్యంగా వాకబులు జరిపించారు. ఓ భూతవైద్యుడు ఓరోజు ముహూర్తం పెట్టించి మూలగది వైద్యం ప్రారంభించాడు. కిటికీలు మూసి గదినిండా పొగలు వేశాడు. ముగ్గులు వేశాడు. కళ్యాణి అందమైన, పొడవైన, నల్లటి, మెత్తటి వెంట్రుకలన్నీ కత్తిరించి సీసాల్లో కెక్కించాడు చాలా నేర్పుగా.

వెంట్రుకలు సీసాల్లో కెక్కించడంలో కళ్యాణికూడా చాలా సాయం చేసింది. కళ్యాణి మొహంనిండా రకరకాల బొట్లుపెట్టాడు. నోట్లో బూడిద పోశాడు. "హ్రాం....హ్రీం....హ్రూం" అంటూ గావుకేకలు వేశాడు రహస్యంగా. చివరి ఘట్టంలో వేపమండలు పట్టుకుని కళ్యాణిని బాదటం మొదలెట్టాడు. కళ్యాణి మండిపడితిరగబడింది. ఇద్దరుమనుషుల్ని పిలిచిదెయ్యాన్ని విరగదీసి పట్టుకోమన్నాడు. తన చాకిరీ తను ప్రారంభించాడు. గదిలో, రహస్య వైద్యంలో కళ్యాణి వేస్తోన్న కేకలకీ, ఏడుపుకీ తల్లి కొంచెం కంగారుపడి— "ఏవిటండీ? ఇది భూతవైద్యమా రాక్షస వైద్యమా?" అంది.

"భూతాలూ, రాక్షసులూ అంతా ఒక్క వంశంవాళ్ళే. నువ్వూరుకో—" అన్నాడు భర్తలవంశంలో పుట్టిన భర్తకోపంగా.

ఆ విధంగా కొన్నాళ్ళు.... మూలగదిలో భూతవైద్యం జరిగింది. కళ్యాణి అందమైన తలకట్టు పల్చబడిందేగాని, దెయ్యాలు దొరికినట్టు లేవు. ఒకరోజు హఠాత్తుగా కళ్యాణి గొప్పబలంతో తిరగబడి భూతవైద్యుణ్ణి చావ బాదింది. ఇంకా ఎన్ని మూలగదుల్లో వైద్యం చెయ్యాలో! తప్పించుకు పోయాడు అతనే దెయ్యంలాగ.

కొన్నాళ్ళ విశ్రాంతి తర్వాత, మళ్ళా ఆ మూలగదిలోనే, పంగ నామాలవారి సన్నికంటి వైద్యం ప్రారంభమైంది. ఆయన చూర్ణాలు నూరుతోంటే, ఆయన పిలక చేసే నృత్యానికి కళ్యాణి చప్పట్లు కొడుతూ నవ్వేది. వైద్యులవారికి కోపం వొచ్చి, పిలక గట్టిగా ముడేసుకునేవాడు. "పంతులుగారూ! పిలక విప్పండీ! అని 'కల్యాణి తెగ బ్రతిమాలేది. మాత్రలూ, కషాయాలూ మింగనని మొరాయించేద. పంతులుగారు మన శాస్త్రనిపుణులవారుకూడాకాబట్టి పిలక విప్పేవారు కళ్యాణి గోలగా నవ్వి మాత్ర మింగేది. కషాయం తాగేది. నిమ్మకాయ తలంట్లతో. భగునమండే కంటి కలికాలతో, ముక్కులోంచి నసాళంలోకి వెళ్ళే పసర్లతో చాలా నిర్దయగా వైద్యం జరిగింది మూలగదిలో. జబ్బు తగ్గుతూ, హెచ్చుతూ గుణం కనిపిస్తూ, తగ్గుతూ హెచ్చుతూ, హెచ్చుతూ తగ్గుతూ, హెచ్చుతూ అట్లాడింది. వైద్యులవారితో.

ఓ రోజు ఆయన చేతులు నలుపుకుంటూ, వొచ్చిన మట్టితో మాత్ర చుడుతూ- "అయ్యా! అమ్మాయివార్ని- మా వైద్యశాలలో క్షమించాలి తమరు అది ఆసుపత్రికాదు. మా వైద్యశాలల్లో, ఎంతోమంది మతి చాంచల్యం పొందిన రోగులు బాగుపడి...." అని విన్నవించబోయారు.

"అది సరే పంతులూ! మా వంశం ఎలాంటిది?"

"అయ్యా! మహదొడ్డ వొంశమండీ!"

"అవునా! మా పరువు ఎలాంటిది?"

"అయ్యయ్య అదికూడా దొడ్డదేనండి. కానీ అమ్మాయిగారి జబ్బు చూశారూ?.... అది వీటన్నిటికన్నా దొడ్డది సుమండీ! అందుచేత.... మా వైద్యశాల...."

"అదుగో మళ్ళా అదేకూతా ?"

"అయ్యా! ఇక ఏ కూతా కుయ్యనండీ!"- అని ఆ వైద్యులవారు ....నన్నికల్లు చంకనపెట్టుకుని—పిలక ఎగరేసుకుంటూ దయచేశారు. మూలగది వైద్య చరిత్ర అలా ముగిసింది.

కళ్యాణి జబ్బు శ్రుతిమించి రాగానపడింది. ఎప్పుడూ నవ్వుతుంది. ఆడపిల్ల ఎప్పుడూ ఆనందంగా నవ్వటం మంచిదే. ఆరోగ్యంకూడాను. కానీ....నవ్వీ నవ్వీ హఠాత్తుగా యేడవటం మంచిదికాదుగదా?.... అనారోగ్యంకూడాను. జుట్టుపీక్కోవడం మంచిదికాదుగదా?.... అందమైన జుట్టంతాపోతుంది అందరితో దెబ్బలాడ్డంకూడా మంచిది కాదుగదా? "ఇదేం పిల్లమ్మా! పిచ్చిపిల్లలావుంది-" అనుకుంటారు. అల్లా అనుకుంటే వంశ మేంగానూ? దాని పరువేంగానూ పరువుచరిత్రేంగానూ వంశంసంగతీ, పరువు సంగతీ తెలియని కళ్యాణి.... వొక్కోసారి వొంటిమీద గుడ్డలు వుంచుకోవడంకూడా మానేసింది. నవ్వులూ,.... ఏడుపులూ కట్టిపెట్టి....అందర్నీ అసహ్యించుకున్నదానిలా....ఎవ్వరితోటీ మాట్లాడ్డం మానేసింది. రాత్రిళ్ళు నిద్రపోదు. తెల్లవార్లూ వొక్కతీ నుంచుని వుంటుంది. "కాళ్ళు నొప్పెడతాయి. కూచో అమ్మా!" అని ఎవరైనా కూచోబెడితే ...దిగ్గునలేచినిలబడి- "నీ కాళ్ళా? నా కాళ్ళా?.... నా కాళ్ళు నా యిష్టం." అని దెబ్బలాటకి దిగుతుంది.

"పిల్ల ఇలా అయిపోయిందేమా?" అన్న బెంగతో పూజ్య తల్లిదండ్రులు....చాలా మొక్కులు మొక్కారు— ప్రేమతో "ఆసుపత్రిలో పెట్టక తప్పదేమో!" అంది తల్లి నిట్టూర్చి,...."పరువుపోక తప్పదేమో-" అన్న ధ్వనితో "ఎలా పెడతామే? పెళ్ళిమాటో? పిచ్చాసుపత్రినుంచి వొచ్చిందంటే ఎంత బాగుపడితే మాత్రం ... ఎవడు చేసుకుంటాడే?" అన్నాడు తండ్రి. అన్నాడేగానీ.... రహస్య స్నేహితులతోటి రహస్య

బంధువులతోటీ రహస్య శ్రేయోభిలాషులతోటీ ఆలోచించాడు రహస్యంగా. చివరకి అందరూ కలిసి తేల్చారు— "ముందు పిల్లకి పెళ్ళి చేసెయ్యాలి."

ఆ తండ్రికీ చాలా వుత్సాహం వొచ్చింది. ఇనప్పెరువాలో డబ్బు చూశాడు. చాలా ధైర్యం వొచ్చింది. పొలాలూ....తోటలూ.... చూశాడు. చాలా గర్వం వొచ్చింది. "హుఁ! వారం రోజుల్లో పెళ్ళి చేస్తాను-" అన్నాడు భార్యతో. ఆ భర్త ప్రగల్భాలూ ....శపథాలూ వినడానికే.... ఆ భార్య ఉపయోగపడుతోంది. ఆవిడ చాలా ఆనందపడింది. "ఆఖరి పిల్ల పెళ్ళి వైభవంగా చెయ్యాలి సుమండీ! మనం ఇక పెళ్ళిళ్లుచెయ్యబోతామా? పెట్టబోతామా?"-అంది అప్పుడే పెళ్ళిపనులకి లేస్తూ, ఇళ్ళ దులుపుళ్ళూ.... సున్నాలూ.... రంగులూ.... ముగ్గులూ.... పిండివంటలూ... అమ్మో! ఎంతపని! "పిల్లకి పచ్చల అడ్డిగ చేయించాలి సుమండీ! ఇప్పుడు పేష నొచ్చిందిట. అందరూ పెట్టుకుంటున్నారు. రేపు పెళ్ళికొచ్చినవాళ్లు నలుగురూ నన్నంటారు. యేమనుకున్నారో!" అందావిడ; కన్నతల్లి వుండి కూతురికి పచ్చల అడ్డిగైనా చేయించింది కాదేమమ్మా? అంటారేమోనని ఆ మాతృ హృదయారాటం.

"అల్లాగేలేవే! దీనికేం గావాలో అన్నీ నువ్వే పురమాయించు. పిల్లకి వొంటినిండా నగల్లేవంటే నాకు మాత్రం చిన్నతనం కాదూ?"-అన్నాడు తండ్రి.

"ఈయన ఎంత యోగ్యులమ్మా! నేను గ్రహించలేకపోయాను!"-అనుకుందా యిల్లాలు కాపురాని కొచ్చిన పాతికేళ్ళకి. కూతురు పెళ్ళి కబుర్లు చెప్పుకుంటోంటే, ఆ తల్లిదండ్రులకు పరవశంగా వుంది. అవతల కూతురు వెర్రికేకలేస్తోంది. తల్లి, తండ్రి పెళ్ళి కబుర్లలో నిమగ్నులై వున్నారు.

* * *

కల్యాణి తండ్రి, డబ్బుతో ఒక వల అల్లించాడు. అది అల్లటానికి ముప్ఫైవేలు పట్టింది. చూడ్డానికి చాలా షోగ్గావుంది. అది పట్టుకుని వేటకు బయల్దేరితే అందులో పడ్డాడు ప్రభాకరం. "అందులో పడ్డాడు." అనేకన్నా "కల్యాణి ఫోటో చూసి ...ఆశలో పడ్డాడు." అనటం ఎక్కువ న్యాయంగా వుంటుంది. కానీ చేతిలో ఆ వల లేకుండా ... ఆ వుత్త ఫోటోతో చూస్తే ఎందులో పడేవాడో స్పష్టంగా తెలిసేది. ప్రభాకరం చదువు కున్నవాడు, అందమైనవాడు, ఉద్యోగం దొరికినవాడు. ఈ మూడు విశేషాలూ చెప్పినంతతేలిగ్గా.... అతను గడుసువాడో, గడుసువాడుకానివాడో," చెప్పడం కష్టం. అతని గడుస్తనాన్ని పరీక్షించిన ఘట్టాలేవీ తారసపళ్లేదు. కానీ మంచివాడు. నెమ్మదస్తుడు. కోపిష్టికాడు. గొప్ప ఆదర్శాలు కలవాడూ కాడు. సినిమాలు చూచువాడు, పుస్తకాలు చదువువాడు. హాయిగా.... సుఖంగా జీవించాలనే కోరికలున్నవాడు. ఒకనాడా చిన్నవాడు.... ఇంకా చిన్నవాణ్ణి... వెంటబెట్టుకొని పెళ్ళిచూపులకొచ్చాడు. హఠాత్తుగా ఆరోజున కల్యాణికి సుస్తీచేసింది– "ఎక్కువసేపు కూచోలేదు పడుకోవాలి. లోపల. డాక్టర్లు కేకలేస్తారు–" అన్నారు. ఐదు నిమిషాలకన్నా తక్కువసేపే చూశాడు ప్రభాకరం కల్యాణిని. ఆ ఐదునిమిషాలలో ఆపిల్ల....ఆపిల్లాడికి ఎంత నచ్చిందో....మనసంతా ఎంతఆక్రమించుకొందో.... ఎంత అందమైన భవిష్యత్తు చూపించిందో .. మాటల్లోకీ, భాషల్లోకీ మార్చిచెప్పడంకష్టం. కష్టంకాదు. అసలు చెప్పడం అన్యాయం. ఆ వెంట వచ్చిన చెలికాడు గోడల మీద ఫోటోలు చూసే వంకతో మొహం....పైకీ . కిందికీ .. పక్కకీ మార్చుతూ.... మైసూర్‌పాక్‌లు ... జిలేబీలూ.... సున్నుండలూ.... గారడీ వాడిలాగ మాయం చేయడం నేర్చుకుంటున్నాడు. ఆ అయిదునిమిషాలలో విద్య నేర్చేసుకుని మొత్తం మాయం చెయ్యగలిగాడు. ఇద్దరూ బయట పడి కారుఎక్కి.... చెరోలోకంలో విహరిస్తూ.... పలకరించుకోకుండా.... కళ్లుమూసుకు కూచున్నారు.

పెళ్ళి స్థిరపడింది. లగ్నాలు పెట్టేశారు.

* * *

పెళ్ళివారిల్లుకన్నా సందడిగావుంది విడిది. ఆడవాళ్ళు, పిల్లలూ రంగు రంగుల పువ్వుల్లా.... పిట్టల్లా.... తిరుగుతున్నారు. పిల్లలు.... గుండ్రాయిలంత మిఠాయివుండలు తింటూ ఆనందిస్తున్నారు. మొగాళ్ళు.... సరిగ్గా అర్థంకాని రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. కుమ్ములాడుకుంటు న్నారు. పెళ్ళికొడుకు స్నేహితులకోసం పేకాడుతూ, తనకోసం కలలు కంటున్నాడు. ఆ కలలవల్లనేమో.... మొహంలో పెళ్ళికళ వుట్టిపడుతోంది.

పెళ్ళి చూపుల తర్వాత కళ్యాణి ఫొటో అతని దగ్గరే వుంది. ఆ ఫొటో అతని గుండెల్లో ముద్రపడివుంది. అతనా ఫొటో ఎన్నిసార్లు చూశాడో ....ఎంత ముద్దాడేడో.... ఆ ఫొటోలోంచి కళ్యాణిని రూపొం దించుకుని.... ఎన్ని మాట్లాడేడో ... అన్నీ కళ్యాణికి చెప్పే ఘడియలు నెమ్మది నెమ్మదిగా సమీపిస్తోంటే, ఇంకా పేకాడమని బలవంతపెట్టే స్నేహితులంతా శత్రువుల్లా కనపడ్డారు. చిరాకుపడ్డాడు. విసుక్కున్నాడు. అతన్ని రక్షించినట్టుగా తల్లి దగ్గర్నుంచి పిలుపొచ్చింది. పారిపోయి లోప లికి వెళ్ళాడు. ఆవిడ చాలా ఆందోళన పడుతోంది– "ఏవిట్రా? ఇలా అంటారూ?"– అంది కొడుకుని చూడగానే.

"ఏవిటి? ఎలా అంటారు?"– అన్నాడు.

"అసలు పెళ్ళికూతురు.... పెళ్ళి చూపుల్నాడు నీతో ఏవన్నా మాట్లాడిందా?"– అంది వ్యవహారానికొస్తూ.

"ఏం? ఇప్పుడెందుకూ?"

"బాగానే మాట్లాడిందన్నావు కదూ?"

"అబ్బ! ఏవిటమ్మా? ఏమైంది?"

"అబ్బే! నేనూ నమ్మటంలేదుగానీ.... ఆ పిల్లకి పిచ్చంటారేవిటి? రెండేళ్ళ నుంచీ వుందిట."

"ఛ! ఎవరు చెప్పారు?"

"ఎవరనకు, వాళ్ళ పేరు బైటబెడితే బావుండదు. అసలు నిజమా? కాదా? అని...."

ఆ ఎవరోగానీ ఆవూరు కీర్తి కాపాడారు. ఆ వూళ్ళోకూడా ఉదార హృదయులున్నారని రుజువు చేశారు. ఆ వూరు కళంకం పోగొట్టారు.

ప్రభాకరం నమ్మలేదు-"వాళ్ళని నేనడగనా?"-అన్నాడు.

"నువ్వడిగినా నేనడిగినా ఒకటే! అసలాపిల్ల ఎలా మాట్లాడిందంటే చెప్పవేం?"

"ఎక్కువేం మాట్లాడలేదుగానీ.... ఉండు రాజుని పిలుస్తాను," అని పెళ్ళిచూపులన్నాడు.... తోడు వచ్చిన స్నేహితుణ్ణి పిల్చుకొచ్చాడు. అతగాడెంత జ్ఞాపకం తెచ్చుకోబోయినా.... జిలేబీల రుచీ.... సున్నుండల పరిమళాలూ తప్ప.... రెండో విషయం గుర్తు రాలేదు." అసలా పిల్లని నేను చూశానా?"- అని ప్రశ్న వేశాడు.

ప్రభాకరానికి... నెమ్మదిగా ఆందోళన ప్రారంభమైంది. "అమ్మ చెప్పే విషయం నిజం కాదుగదా?" అనుకున్నాడు.

"ఇప్పుడేం చేద్దామంటావు? నేనింకా మీనాన్నతో అనలేదు." అంది వాళ్ళమ్మ కంగారుపడుతూ.

"ఇంకేం చెయ్యగలం? వాళ్లనే అడుగు" అన్నాడు.

"ఛ! బావుంటుందా?.... అయినా 'మా పిల్ల పిచ్చిదేనమ్మా!' అని వాళ్ళు నిజం చెప్తారా?"

"మ రేంచేద్దాం? వీధిలో వాళ్లనీ.... వూళ్ళో వాళ్లని వాకబు చేసే కన్నా.... అదేనయం. ఏదో చెయ్యమ్మా! అదేవిటో తేల్చుకో ముందు-" అని అక్కడ నిలబకలేని వాడిలాగ... దిగాలు పడ్డ మొహంతో.... నిరుత్సాహంగా వెళ్లాడు. ఆకొడుకు.... మొహంలో, కళ్ళల్లో, మాటల్లో విచారం చూస్తే ... తల్లి అనురాగమంతా ఒక్కసారి పొంగింది- "ఏవిటో వాళ్ళనే అడుగుతాను. మోమాటాలకి పోయి.... పిల్లాడి జీవితం నాశనం చేసుకుంటామా?" అనుకుని ఆవిడకూడా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

* * *

ముహూర్తం రెండే రెండు గంటలుంది. పెళ్ళిపందిరి విద్యుద్దీపాలతో పట్టపగలుగా వెలిగిపోతోంది. చాలామంది కుర్చీలమీద కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. హడావుడిగా తిరిగేవాళ్ళు తిరుగుతున్నారు. బ్యాండు వాళ్ళు చాలా అందంగా సినిమా పాటలు వాయిస్తున్నారు. పురోహితులు....మండపంలో పీటలు వేయించి....సరంజామా అంతా సర్దిస్తున్నారు. అంతా చురుగ్గా జరుగుతోంది. అయినా అందరూ నిరుత్సాహంగా వున్నారు. ఏదో వినటానికి సిద్ధంగా వున్నారు.

లోపల, అంతఃపురంలో పెళ్ళికూతురు పట్టుచీరతో వంటెడు నగలతో, మూలగదిలో బ్యాండు పాటలకి అనువుగా చక్కగా డ్యాన్స్ చేస్తోంది. ఎంతో అందంగా-లయబద్ధంగా అడుగులేస్తోంది. బ్యాండు ఆగినప్పుడల్లా-"వాయించండర్రా। నా పెళ్ళి! వాయించండర్రా।" అని కేకలేస్తోంది.

ఆ పిల్ల మనసు ఏ రోజుల్లో చాలా శాంతంగా వుంటుందో ఆలోచించి మరీ లగ్నం పెట్టారు అయినా యింట్లో హడావుడీ, బాజాలూ, పాటలూ అన్నీ విని నవ్వుల్లోకి, డ్యాన్సుల్లోకీ దిగింది. మత్తు ఇంజెక్షన్ ఇప్పించి పడుకోబెడదామనుకున్నారు. లగ్నం వేళకి చాలా ఇబ్బంది అవుతుందని వూరుకున్నారు. ఐదు నిమిషాలకోసారి ఓ భీముడంత మనిషి కల్యాణి దగ్గిరికి వెళ్ళి కేకలేసి, అల్లరి చెయ్యవద్దని మందలించి కొడతానని బెదిరించి, ఎదురుతిరిగితే ఓ లెంపకాయ కొట్టి, అన్నమాట నిలబెట్టుకొని, వెళ్తున్నాడు. కల్యాణి కాస్సేపు ఏడ్చి—జుట్టు పీక్కుని బ్యాండులో పాట రాగానే డ్యాన్సులోకి దిగుతోంది.

పెళ్ళికొడుకూ, అతని తల్లీ అరగంట నించీ ఆ గదిగుమ్మంలో నిశ్చేష్టులై నిలబడి వున్నారు. ఎవర్నీ అడక్కుండా....ఎవరూ చెప్పకుండా....అంతా వాళ్లకి అర్థమైంది. కల్యాణి తల్లి ఏకదారగా ఏడుస్తోంది. కల్యాణి తండ్రీ ఇద్దరు ముగ్గురు దగ్గిర బంధువులూ కోర్టులో నిలబడ్డ ముద్దాయిల్లాగా ఆ గదిలో అక్కడక్కడా నిలబడ్డారు. కిక్కురుమనకుండా

నిలబడ్డం కూడా వాళ్ళ వంశ లక్షణం కావచ్చు. కల్యాణి తండ్రిగారు ప్రస్తుతం మాట్లాడ్డంలేదుగానీ, మాట్లాడినప్పుడు వారే చెప్తారు. పెళ్ళికొడుకు తండ్రి వొక్కడే ఓ కుర్చీలో కూచుని పెళ్ళికూతుర్ని ఆశ్చర్యంగా చూస్తు న్నాడు. పెళ్ళికొడుకు కోసం వేసిన పరుపుల కుర్చీ ఖాళీగా వుంది. అదీ ఆ గదిలో వాతావరణం. చుట్టుపక్క లెవ్వరూ రాకుండా ఇద్దరు మనుషులు కాపలా కాస్తున్నారు. ఆ వంశం పరువు ప్రతిష్ఠలు ఆ గది గడప అవత ల్నించీ యథాతథంగా విరాజిల్లుతూ వుండాలని....ఆ వంశోద్ధారకుడి.... వాంఛితం.

కొంతసేపటికి .... కల్యాణి .... అందర్నీ చూసి చిన్నబుచ్చుకుని మొహం చిట్లించుకుని, డాన్సు మానేసింది--'వీళ్ళముందా డాన్స్ చేసేది?--' అన్నట్టు దూరంగా పోయి గోడని కరిచి పెట్టుకుని నించుంది. ప్రభాకరం మనసంతా ఏడుస్తోంది. కళ్ళు స్రవిస్తున్నాయి. అంతమందిలో.... కళ్ళనీళ్ళు కారుస్తూనే కల్యాణిని చూస్తున్నాడు. అతని సుందరస్వప్నాలు, అతని మధురలోకాలు,అతని రంగురంగుల పూలతోటలు....సుఖాల....అందాల.... అనురాగాల....పరిమళాల....దాంపత్యం —— అతని హృదయాంతరాలలో ముద్రపడివున్న....ప్రియురాలు... స్నేహితురాలు .... అర్ధాంగి .... అతని మనోలోకం .... సమస్తం అల్లకల్లోలమైంది. దుఃఖం తెరలు తెరలుగా వస్తోంది. పట్టరాని కోపం వొచ్చింది——"నన్నెందుకిలా ధ్వంసం చేశారు?" అని గర్జించాడు. కంఠం పెగల్లేదు. మాటలు ధ్వనించలేదు. మూగవాడ య్యాడు. బొటబొటా కన్నీళ్ళు కార్చాడు. కోపం తగ్గింది. వెర్రిగానూ, అమాయకంగానూ, భయంగానూ చూస్తోన్న కల్యాణిని అక్కున చేర్చు కుందామనుకున్నాడు——"ఈమె నా భార్య. నేను విడిచి పెట్టను" అను కున్నాడు. తదేకంగా చూస్తూనే వున్నాడు తడి కళ్ళతో, అర్థ్రితతో, ప్రేమతో.

కల్యాణి తల్లి ఏడుస్తూ, మాట్లాడుతూ, మాట్లాడి ఏడుస్తూ, ఏడ్చి మాట్లాడుతోంది. బంధువులు కొంత పలుకుతున్నారు. అప్పటికి నూటపద

హారు సార్లు చెప్పిన మాటలు మళ్ళీ మళ్ళీ చెప్తూ ఏడుస్తోంది—"వొదిన గారూ! పెళ్ళయి కాపురం చేసుకుంటే దాని మనసు బాగుపడుతుందని ఎంతో మంది చెప్పారు. పెళ్లిగాని పిల్లని పిచ్చాసుపత్రుల్లో పెడితే పెళ్ళెలా అవుతుంది చెప్పండి? దాని బతుకేం గానూ?.... మీకే ఓ ఆడపిల్లవుంటే " అని ధర్మపన్నాల జోలికి పోబోయింది. "చాల్లెండి. ఎన్నిసార్లు చెప్పినా ఇదేగా చెప్తారూ? ఇలాంటి పిచ్చిపిల్లని చేసుకుంటే నా కొడుకు బతుకేం గానూ? డబ్బుతో కాపరం చేస్తాడా? మీకు డబ్బుంటే వుండచ్చును గానీ... పిచ్చి పిల్లని అంటగట్టటానికి మీకెన్ని గుండెలూ? సమయానికి తెలిసింది గానీ లేకపోతే వాడి బ్రతుకంతా ఏమయ్యేదీ?" అని తెగ ప్రశ్నలు వేసింది ప్రభాకరం తల్లి.

"వొదెనగారూ! మీరల్లా భయపడవద్దు. ఆ మూడు ముళ్ళూ పడనివ్వండి పిల్లని ఎన్ని వూళ్లయినా తిప్పి....ఎన్ని వేలైనా ఖర్చు పెట్టి.... బాగుచేయించుకుంటాము. మీకా పూచీలేదు."

"మాకేపూచీలూ వొద్దుగానీ మా దార్ని మమ్మల్ని పోనివ్వండి. డబ్బు వుందని ఇంత విరగబాటు పనికిరాదు. పెళ్లి చేసుకునే వాడు సుఖపడాలని చేసుకుంటాడా? ఆసుపత్రుల్లో పడి ఏడుద్దామని చేసుకుంటాడా?" అని మళ్లీ రెండు ప్రశ్నలు వేసింది ప్రభాకరం తల్లి.

అప్పుడప్పుడూ ముందుకొచ్చి వొంత పాటపాడి వెనక్కి పోతోన్న ఓ పెళ్లివారి బంధువు-మళ్లా ముందు కొచ్చాడు—"అమ్మా! మావల్ల చాలా తప్పే జరిగింది. పెద్దవారు మీరు గ్రహించాలి. పిల్లదానికి పుటకనించీ స్థిమితం లేదనుకున్నారా? నిక్షేపం లాగ స్కూల్ఫైనల్ పేసయ్యింది. దాని ఖర్మగాలి మధ్యలో వొచ్చిందీ తెగులు. మీరు కొంచెం శాంతపడాలి గానీ. అసలు పిల్లది భర్తతో కాపురం చేసుకుంటే...."

"కాపురం ఎల్లాగయ్యా పిచ్చి మాలోకంతో?" అని మండిపడింది ప్రభాకరం తల్లి.

ఆ పెద్దమనిషి అతి వినయంతో కుంచుకుపోయి, ముడుచుకుపోయి, సగంవొంగి– "అల్లా అనెయ్యకండి. పిల్లదానికి స్థిమితం లేని మాట నిజమే గానీ, కరుస్తుందా? రక్కుతుందా? అల్లాంటి జబ్బుకాదు సుమండీ!"– అన్నాడు. కాపరం చెయ్యడానికి కరవకపోవడం రక్కకపోవడం చాలునని ఆ రసికాగ్రేసరుడి అనుభవసారం.

ప్రభాకరం తల్లి పోట్లాటకి దిగుతూ .... "సరేనయ్యా! రేపు పిల్లా పీచూ కలుగుతారు. ఎల్లా పెంచుతుంది తల్లి?"– అని తిరుగులేని ప్రశ్న విసిరింది.

కల్యాణి తల్లి కాస్సేపు....యాడవడం మానుకుని చేటంత మొహం చేసుకుని – "వొదినగారూ! దాని కడుపున ఓ కాయ కాయాలేగాని.... అది పెంచాలిటండీ?....అన్నీ నేను చూస్తాను? ఇద్దరు దాదుల్ని పెడతాం."

"ఇద్దరు డాక్టర్లని పెడతాం–" వొంతపాట.

"ఇద్దరు దాసీల్ని పెడతాం–" కన్నతల్లి.

"ఇద్దరూ" వొంతపాట.

"ఏవిటి మీ అహంకారం?– అని రంకె వేశాడు ప్రభాకరం. అతని మనసంతా ఉడుకుతోంది. వొళ్ళంతా వొణుకుతోంది. మొహమంతా చెమటలతో ఎర్రగా కాల్చేసాలా చూశాడు. "ఎన్నికోట్ల డాక్టర్లు, ఎన్నికోట్ల దాదులు, ఎన్నికోట్ల దాసీలు, కలిస్తే తల్లి అవుతుంది? ఆ పిల్లని అంత జబ్బుతో అలా వుంచి .... పెళ్ళి చేస్తారా పెళ్ళి? ఆ వొచ్చినవాడు మర్నాడే వొదిలేసిపోతే ఏం చేస్తారు?" అని రంకెల వర్షం కురిపిస్తూ విరుచుకు పడ్డాడు.

"జవాబు చెప్పాలికావున్ను"– అనుకుంది అత్తగారు.

"ఏం చేస్తాం నాయనా?.... మా దగ్గరే వుంచుకుంటాం–" అంది వినయంగా.

"ఆ వుంచుకోడం ఇప్పుడే వుంచుకోండి-" అంటూ కుర్చీలోంచి లేచాడు ప్రభాకరం తండ్రి.

"ఇవి చేతులు కావు. తొందరపడకండి-" అంటూ తొందరపడుతూ ఆ లేచినాయన చేతులే పట్టుకున్నాడు కళ్యాణి తండ్రి. కాళ్ళు పట్టుకునే రివాజు కూడా వాళ్ళ వంశంలో వుందో లేదో ఆయనకి సరిగ్గా తెలీదు. లేక పోతే అవికూడా పట్టుకుని. ఆనవాయితీ నిలిపేవాడు. "నన్నడిగి ఏం ప్రయోజనం? రేపు భార్యతో కష్టసుఖా లనుభవించవలసినవాడు వాడుకదా!" అని మళ్లీ మెత్తగా పరుపుల కుర్చీతో సుఖంఅనుభవించటానికి.... వెనక్కివాలి మత్తుగా.... బద్ధకంగా కూర్చున్నాడు ప్రభాకరం తండ్రి.

"నాయనా నువ్వే మంటావు?" అని పెళ్ళికొడుకు ఎదుట దోషిలా నిలబడ్డాడు ఆ గొప్ప వంశస్థుడు. పెళ్ళికొడుకు వినయంగానే మాట్లాడాడు.

"చూడండీ! ఎలా సుఖపడాలో నాకు తెలియదుగానీ ఎలా కష్ట పడకూడదో బాగా తెలుసు. ఈ పెళ్ళి చేసుకుని మేమిద్దరం సుఖపడేదేమీ వుండదు. ముందు మీ అమ్మాయికి మంచి డాక్టర్లతో వైద్యం చేయించండి. ఆమె జబ్బు తగ్గిపోతే, పెళ్ళి చేసుకోవచ్చునని డాక్టరు చెప్తే - నేనే చేసుకుంటాను. అంతవరకూ నేను పెళ్ళి చేసుకోను. మీకు మాట యిస్తున్నాను-" అన్నాడు ప్రభాకరం. పెద్దవాళ్ళంతా తలోవిధంగా ఆశ్చర్య పడ్డారు. "అదేవిట్రా నీ షరతులూ నువ్వూనూ! నీకు దేశంలో పిల్లలు దొరకరనుకుంటున్నావా? వాళ్ళ వైద్యం చేయించేవరకూ నువ్వు ఆగడం ఏమిటీ? వాళ్ళింత మోసానికి టగితే నువ్విలా మాట్లాడతావేమిటి ?- అంటూ అతని తల్లి దుయ్యబట్టింది.

"ఏవిటీ? ఇప్పుడు పెళ్ళి ఆగిపోవాలా?-" అని పెళ్ళి పెద్దలు ఆశ్చర్యపడుతున్నారు—"చూడు నాయనా! నువ్వన్నది మంచిమాటే. కానీ ఇన్ని ప్రయత్నాలు చేసి, ఇంతమంది బంధువుల్ని పిల్చి తీరా లగ్నం ముందు పెళ్ళి ఆగిపోతే మా వంశాని కెంత అప్రదిష్ట నాయనా!" అన్నాడా ప్రతిష్టల మానవుడు. ప్రభాకరం— చాలా ఓర్పు తెచ్చుకుని- ఆ పిచ్చి

పిల్లకోసం నేను మీతో ఇన్ని మాటలు మాట్లాడుతున్నాను. ఇప్పుడు చేసు కున్న ప్రయత్నాలు మళ్లీ చేసుకోవచ్చును. ఇప్పుడున్న లగ్నాలు ఎప్పుడూ వుంటాయి. కానీ ఇప్పుడున్న ఆందోళనా విచారమూ అప్పు డుండవు. ఇప్పుడు లేని సంతోషమూ, సంతృప్తి అప్పుడుంటాయి. అదే పెళ్ళిగానీ— ఇది కాదు. ఈ పెళ్ళి చేసుకుని నన్నేం ఆనందించమం టారు?"- అన్నాడు దీనంగా.

అల్లుడు కొంచెం వేడితగ్గి మాట్లాడుతోంటే ఇంకా చల్లబరుచు దామని.... గడుస్తనంగా— నీ ఆనందమే మా ఆనందం నాయనా! నీకు విచారం కలగనిస్తామా? నీ కిచ్చేదానికి రెట్టింపుతీసుకో. నీముద్దు ముచ్చట్లన్నీ తీర్చే పూచీ నాది. పెద్దవాణ్ణి నా మాట కొట్టెయ్యకు. ఆ మూడు ముళ్ళూ పడనియ్యి"- వాక్కో ముడికీ పదేసివేలు. తీసుకోమన్న లెక్కలో మాట్లాడా డాయన.

ప్రభాకరం అసహ్యంతో, కోపంతో అరవబోతోంటే, ఆస్థాన పురోహితు డొకాయన కాపలా వాళ్ళని జయించుకుని రహస్యగది గుమ్మంలోకి వొచ్చేశాడు....అంతా కుతూహలంగా పరికిస్తూ గృహస్తు నుద్దేశించి— "అయ్యా! శుభలగ్నం సమీపిస్తోంది. వధూవరులు పీటల మీదకు రావాలి. అవతల ..." అంటూ యాకరువు పెట్టబోతోంటే గృహస్తు అడ్డుకుని— "వొచ్చేస్తున్నారు పంతులుగారూ! కొంచెం లాంఛనాల విషయం మాట్లాడుకుంటున్నాం: మీరు పెళ్ళి అన్నీ సిద్ధం చెయ్యండి. ఇదుగో! అల్లుడు చదువుకున్నవాడు. మీ పాత కాలం తతంగాలేవీ పెట్టకండి .. మాంగల్యం ధారణ చాలు, ఐదు నిమిషాల్లో ముగించెయ్యాలి. యావను కున్నారో!.... అల్లుడికి యాభై వేలు కట్నం చదివించండి. గుర్తుంచు కోండి.-" అని హడావిడిగా పురమాయిస్తోంటే.... ప్రభాకరం నిప్పులు కక్కుతూ — పురోహితులవారి మీదికిపోయి—కాలు చితకతొక్క.... "ఇదుగో పంతులూ! పెళ్ళి చెడిపోయిందని చెప్పెయ్. పెళ్ళికొడుకు వెళ్ళి పోతున్నాడని అందరికీ చెప్పెయ్. ఇంకా నించున్నావేం ఫో అవతలకి-"

అని పురిమి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ తనే వెళ్ళిపోయాడా గదిలోంచి తర్వాత అతని తల్లీ, పరుపులకుర్చీలోంచి బద్ధకంగా లేచి అతని తండ్రీ నెమ్మదిగా నిష్క్రమించారు. "ఇలా మా వంశంలో ఎన్నడైనా జరిగిందా? ఆడపిల్ల పెళ్ళి హఠాత్తుగా ఆగిందా?–" అని బంధువుల్ని వాకబు చేశాడు గృహస్థు. కొందరు "లే" దన్నారు. కొందరు "ఏమో!" అన్నారు. కొందరు తెలీదన్నారు. ఇలా జరిగితే అసలీ వంశం ఇంకెవరిదోకాని మీది కాదన్నారు.

చివరికి — "వాడే వూడిపడ్డాడా? ఎవడికో వొకడికి చెయ్యక." అని సలహాలిచ్చారు. చాలా గొప్పగా నచ్చిందది గృహస్థుకి. హృదయానికి హత్తుకుపోయింది. వంశ గౌరవం కాపాడేందుకు పెద్దలే ఆ దారి చూపించా రనుకున్నాడు.

"పిల్ల పెళ్ళి ఎందుకు జరగదో నేనూ చూస్తాను–" అని ప్రతిజ్ఞ చేశాడు. గృహిణి చాలా ఆనందించింది. "పెళ్ళి ఆగదుగదా?– పచ్చల అడ్డిగ వృధాకాదుగదా?" అని నిబ్బరపడింది.

కల్యాణిని చేసుకునేందుకు ఆ ఎవడో వొకడు దొరికాడు. పెళ్ళి పందిట్లో బీడీ కాలుస్తూ. పేరు శ్రీరామచంద్రమూర్తి. ఎక్కువ చదువు కోలేదు. బ్రహ్మకూతురు ఆషామాషీగా, బద్ధకంగా "నాన్న తిట్టడుగదా?" అన్న ధైర్యంతో కళ్ళూ ముక్కూలూ, చెక్కిళ్ళూ సరిగ్గా దిద్దకుండా, మెరుగులు పెట్టకుండా ప్రాణం పోసేసింది. "ఫర్వాలేదులెమ్మా! మొగాడికి అందమేమిటి?–" అని బ్రహ్మ శ్రీరామచంద్రమూర్తిని వాళ్ళమ్మ బొజ్జలోకి విసిరేశాడు. వాడు పెరిగి పెద్దవాడై, ఇంతవాడై, వాళ్ళమ్మతోపాటు పెళ్ళి కొచ్చాడు—"నీకు పెళ్ళి చేస్తాం–" అని పట్టుకున్నారు శ్రీరామచంద్ర మూర్తిని. ఆ యువకుడుజడుసుకుని వాళ్ళమ్మ దగ్గిరికిపరిగెత్తాడు. వాళ్ళమ్మ అప్పటికే వియ్యాలవారిచ్చే లాంఛనాల పట్టీ విని మూర్ఛబోయి తేరు కుంటోంది. ఆవిడ మొహం కళకళా వెలుగుతోంది. మొగుడితో కాపరం చేసినా్న దేనాడూ ఆ మొహంలో అంత అందం కనపళ్ళేదు.

"అమ్మా! ఇదేవిటే?-" అన్నాడు కొడుకు బెంబేలుపడుతూ. అది అంతేరా నాయనా! అదృష్టం వొచ్చేసింది. పెళ్ళికొడుకు వయ్యావు. ఇల్లా కలిసొస్తుందని కల్లోకూడా అనుకోలేదురా నాయనా! మీ నాన్న లేరుగదా?" అని రివాజుగా ఏడ్చిందావిడ— ఆ నాన్న లేనందుకు అసలు ఆనందంగా వున్నప్పటికీ. "ఆ పిల్ల పిచ్చిదంటగా?-" అన్నాడు కొడుకు కొంచెం గునుస్తూ.

"పిచ్చో, వెర్రో నీ కెందుకురా? యాభై వేలు, మోటారుబండి, రేడియో పెట్టి, వాచీ గొలుసు, వెండి పళ్ళేలు, చెంబులు, గిన్నెలు, అబ్బ ఎన్ని చెప్పను? అసలు అవన్నీ ఎక్కడ దాచుకోవాలో ఆలోచించు ముందు. నాగయ్యగారి ఇనప్పెట్లో పెడదామా? వీరన్న భోషాణంలో పెడదామా? మీ అత్తవారే ఓ ఇల్లు కట్టిస్తే మనకీ తిప్పలుండవు. యామంటావురా?"

అమ్మ చెప్తోంది. బాగానే వుంది. అంత డబ్బు అన్ని వొస్తువులు ఎల్లా వస్తాయి మరి?

"మరి సీత ఎలాగే?" అన్నాడు సిగ్గుపడుతూ. సీత అతని మేన మామ కూతురు— "బీడీలు మానెయ్యి. పెళ్ళి చేసుకుంటాను-" అంటోంది.

"పెళ్ళి చేసుకో, మానేస్తా-" అంటున్నాడు ఇతను.

—"నీ కెలాగేవిటి? దాన్ని చేసుకుందువుగాని, ఈ పిచ్చిదేం వొద్దంటుందా? కాదంటుందా? అయినా అసలు దీన్ని మన కొంపకి పంపించర్రా? నాలుగురోజులు పోనిచ్చి —పచ్చిదాంతో కాపరం కుదర దని వొదిలేద్దువుగాని. ముందు మూడు ముళ్ళు వేసి.... ఆ డబ్బుసంచీ పట్టుకో. దాని ముళ్ళు మనం విప్పుదాం."

"అందులో డబ్బంతా వుంటుందో లేదోనే అమ్మా?"

"అంత తెలివితక్కువ దాన్నట్రా? నీ కెందుకు నువ్వూరుకో."

"మళ్ళా నువ్వు తిట్టకు. ఆ డబ్బులో కొంచెం పెట్టి సీతకి నక్లీసు చేయిస్తాను."

"అలాగే నీ యిష్టం. అసలు కోడలు అదేలే!" ఈ రకంగా శ్రీరామచంద్రమూర్తి జ్ఞానబోధా, కర్తవ్య బోధా పొందినవాడై మంగళ స్నానం చేసి పెళ్ళి పీట ఎక్కాడు.

కల్యాణికి బాగా నిద్రొస్తోంది. పీటమీద కూచోనని మొరాయించింది మిఠాయి వుండ చేతిలో పెట్టి కూచోబెట్టారు. తన పీట పక్క పెళ్ళి కొడుకు మారిన వృదంతంగానీ, తన పెళ్ళి తతంగంగానీ కల్యాణికి తెలియదు.

పురోహితులు పవిత్రమైన మంత్రాలు చదివారు. బ్యాండులో అందమైన పాటలు వాయించారు. పెద్ద మనుషులు ఆశీస్సులతో అక్షింతలు విసిరారు. పిచ్చిది ఏం చేస్తుందోనని భయపడుతూ—ఇద్దరు మనుషులు పెళ్ళికూతుర్ని పట్టుకున్నాక పెళ్ళికొడుకు కల్యాణి మెడలో మంగళ సూత్రాలు వేలాడదీసి చివర తాళ్ళ కొసలు కలిపి రెండుముళ్లు వేసి వూడ దని గ్రహించి గబగబా కూచున్నాడు. ఆ ముళ్లు వేసినందుకు చాలా సంతో షించి అత్తమామలు పెద్ద మూట మోసుకొచ్చి అల్లుడి వొడిలో పెట్ట బోతోంటే, వియ్యాపురాలు వూడలాక్కుని వీపుమీద మోసుకుపోతూ అంతర్ధానమైంది.

"సీత మెళ్ళో మూడు ముళ్ళూ వెయ్యాలి—" అనుకుంటున్నాడు. పెళ్ళికొడుకు.

వైభవోపేతముగా, శాస్త్రబద్ధంగా, వేదయుక్తంగా పెళ్ళి జరిగి పోయింది. జననీ జనకులకు కన్యాదాన ఫలం దక్కింది. వారి పూర్వీకుల వంశప్రతిష్ట నిలిచింది. బంధువులూ, చుట్టాలూ తెగ తిని తెగ పొగిడారు. అవన్నీ విన్నాక .. పెళ్ళి పెద్దల కీర్తికాంక్ష తీరింది.

సరే!— ఈ పిచ్చి పిల్ల మాటేమిటి? వెర్రి శ్రీరామచంద్రుడి గతే మిటి? ఈ ఇద్దరూ దంపతులై జీవితాంతమూ బ్రతకాల్సిందేనా ? ఇతని

సీత ఇతనికి దగ్గరౌతుందా? మామగారి వంశ మర్యాదలకీ, డబ్బుకీ, పలుకుబడికీ ఈ అమాయకుడు ఆహుతి కాకుండా నిలబడగలడా? అసలు వాళ్ళిద్దరికీ జరిగింది పెళ్ళేనా ? ఖూనీయా? ఈ పెళ్ళి చెడడమో, చెడగొట్టడమో ఈ పసివారి శ్రేయస్సుకి అవసరం కాదా? శివభక్తులేమంటారు? అయ్యో ! పిచ్చి కల్యాణికి పిచ్చి తగ్గిపోదుకదా బ్రతికినన్నాళ్ళూ తన పిచ్చి లోకంలో నిర్విచారంగా జీవిస్తుందిగదా?

("స్వాతి" మాసపత్రిక నుంచి)